

దమ్ముంటే రా.. లొకేషన్ పెడతా..!

- తాడిపత్రి సీఐకి రాంపుల్లయ్య సవాలు
- జేసీ ప్రభాకర్ రెడ్డి నంబర్ ఇవ్వాలని ఫోన్
- కేసు నమోదు చేసిన పోలీసులు
- జిల్లా బహిష్కరణ దిశగా అడుగులు



రాంపులయ్య (ఫైల్)

అనంతపురం/క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాంపుల్లయ్య అనే వ్యక్తి తాడిపత్రి సీఐ సాయి ప్రసాద్‌కు ఫోన్ చేసి రెచ్చగొట్టాడు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఫోన్ నంబర్ కావాలని అడిగాడు. 'నా పేరు రాంపుల్లయ్య. జేసీ ప్రభాకర్‌రెడ్డి గారి ఫోన్ నంబరు చెప్తారా మాకు. ఆయన నాకు ఫోన్ చేసి నా కథ చెప్తానన్నాడు. నేను మళ్లీ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. మీరు నంబరు ఇస్తే ఏం కథ చెప్తాడో కనుక్కుంటా..' అని అన్నాడు. దీంతో అవాక్కయిన సీఐ, 'ఎవరు నువ్వు..? ఏ ఊరు..? జేసీ ప్రభాకర్ రెడ్డి నంబరును నేనివ్వాలా..?' అని ప్రశ్నించారు. దీనికి.. 'అవును నువ్వే ఇవ్వాలి. ఫిర్యాదు చేసినా కేసు కట్టరు కదా..?' అని రాంపులయ్య ఆరోపించడం, 'నేను నీ సర్వెంట్‌ను కాదు.. ఏమైనా ఉంటే వచ్చి కంప్లయింట్ రాసివ్వు..' అని సీఐ అనడంతో పరస్పరం వాగ్వాదం జరిగింది. దూషణల దాకా వెళ్లింది. తాను అనంతపురంలో ఉన్నానని, లైవ్ లొకేషన్ పెడుతున్నానని, దమ్ముంటే రావాలని సీఐకి రాంపుల్లయ్య సవాలు విసిరాడు. ఈ క్రమంలో ఒకరినొకరు బూతులు తిట్టుకున్నారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సీఐని రెచ్చగొట్టినందుకు తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇదేం కొత్తకాదు..

తాడిపత్రి అంబేడ్కర్ నగర్‌కు చెందిన బి.రాంపుల్లయ్యపై ఇదివరకే నాలుగు కేసులు ఉన్నాయి. తాడిపత్రి రూరల్ స్టేషన్‌లో రెండు, టౌన్ స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయి. తాజాగా ఐదో కేసు నమోదైంది. 2020లో నాటు సారా అమ్ముతూ పట్టుబడటంతో తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. అదే ఏడాది పోలీసులు, సామాన్యుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో ఇదే స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. 2021లో రాత్రి పూట అనుమానాస్పదంగా తిరుగుతూ, పోలీసులతో అసభ్యకరంగా మాట్లాడటంతో తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2023లో ఓ మహిళను మోసగించినందుకు తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. రాంపులయ్య వ్యవహారాన్ని ఎస్పీ జగదీష్ సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్ర విచారణకు ఆదేశించారు. అతన్ని జిల్లా నుంచి బహిష్కరించేందుకు పోలీసు అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఇదీ గొడవ..

ఎమ్మార్పీఎస్ కార్యకర్తను అని చెప్పుకునే రాంపుల్లయ్య, తాడిపత్రి టౌన్ బ్యాంకులో రుణం తీసుకున్నట్లు సమాచారం. తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు సిబ్బంది నోటీసులు పంపారు. బకాయిలు ఉన్న అందరినీ పిలిచి సమావేశం ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారని, సమావేశానికి రావాలని బ్యాంకు ఉద్యోగి ఒకరు రాంపుల్లయ్యకు ఫోన్ చేశారు. అతనితో రాంపుల్లయ్య దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. దీంతోపాటు సమావేశానికి హాజరుకాకపోవడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి తనవద్ద ఉన్న ఓ వ్యక్తితో రాంపులయ్యకు ఫోన్ చేయించారు. ఆ సమయంలో జేసీ ప్రభాకర్‌రెడ్డితో రాంపుల్లయ్య అగౌరవంగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి కొంత కోపానికి గురయ్యారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాంపుల్లయ్య తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్‌కి ఫోన్ చేసి, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫోన్ నంబర్ అడిగాడు. సీఐని రెచ్చగొట్టడంతో ఆయన సీరియస్ అయ్యారు. ఈ క్రమంలో బూతులు తిట్టుకున్నారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డంపులో.. కంపు అంతేనా..!

విచారణ దిశగా కనిపించని చర్యలు



డంపింగ్ యార్డ్

జేసీ విచారణ ఏమైంది...?

డంపింగ్ యార్డ్‌లో అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అప్పటి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిశారు. అవినీతిపై విచారణ చేయించాలని కోరుతూ లేఖ సమర్పించారు. ఆ తరువాత కొన్ని రోజులకే ఆయన బదిలీ అయ్యారు. అనంతరం జేసీగా వచ్చిన శివ్‌నారాయణ శర్మ విచారణ చేస్తారని నగరపాలికలో ప్రచారం జరిగింది. రెండు నెలల క్రితం, నగరపాలిక కమిషనర్‌గా నాగరాజు ఉన్న సమయంలో డంపింగ్‌యార్డ్ ఫైల్‌కు సంబంధించి రెండు పత్రాలు కనిపించలేదని తేలింది. అవి తీసుకురావాలని, లేనిపక్షంలో తానే ఆఫీస్‌కు వస్తానని జేసీ హెచ్చరించారని ప్రచారం జరిగింది. మళ్లీ ఆ పత్రాలు దొరికినట్లు తెలిసింది. కానీ విచారణ జరుగుతున్నట్లు మాత్రం కనిపించడం లేదు.

- బయోమైనింగ్ ప్రక్రియపై అనుమానాలు
- రూ.15 కోట్ల పెండింగ్ బిల్లు కోసం ఒత్తిళ్లు
- డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్త

అనంతపురం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరపాలిక పరిధిలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కావడంలేదు. అక్కడ వేల టన్నుల చెత్త పేరుకుపోయింది. వైసీపీ హయాంలో బయోమైనింగ్ పేరుతో అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. తక్కువ చెత్తను బయోమైనింగ్ చేసి, ఎక్కువగా చేసినట్లు చూపించి బిల్లులు కాజేశారనే ప్రచారం జరిగింది. కూటమి అధికారంలోకి వచ్చాక అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జాయింట్ కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. డంపింగ్‌యార్డ్ అవినీతిని నిగ్గు తేల్చాలని కోరారు. కానీ విచారణ దిశగా కదలికలు కనిపించడం లేదు. మరోవైపు రోజూ నగరంలో సేకరిస్తున్న టన్నుల కొద్దీ చెత్త డంపింగ్ యార్డుకు చేరుతోంది. అప్పుడప్పుడు మంటలు చెలరేగుతున్నాయి. దట్టమైన పొగ చుట్టుపక్కల వారికి నరకం చూపుతోంది. డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి మార్చాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. అధికారులు, పాలకులు ఎందరు మారినా తడిచెత్త, పొడి చెత్త వేరు చేయించడంలో విఫలమవుతూనే ఉన్నారు. కౌన్సిల్ సమావేశాలు జరిగిన సమయంలో మాత్రం అవినీతిపై చర్చ జరుగుతుంది. కానీ నిగ్గు తేల్చేవారు లేరు. మరోవైపు బయోమైనింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టు సంస్థ ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. అధికారపార్టీ నేతల నుంచే ఈ ఒత్తిడి వస్తోందనే ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

ఏం జరిగింది...?

స్వచ్ఛ భారత్ కింద డంపింగ్‌యార్డ్‌లో బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టారు. నోవాగ్రీన్ సంస్థ ఈ ప్రాజెక్టు చేపట్టింది. రూ.24 కోట్ల అంచనాతో 2021 డిసెంబరు నుంచి పనులు ప్రారంభించింది. నిబంధనల మేరకు 2022 డిసెంబరుకు ఈ పని పూర్తి కావాలి. కానీ పూర్తి చేయలేకపోయారు. దీనికితోడు చేయాల్సిన పరిమాణంలో చెత్తను బయోమైనింగ్ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో బిల్లు చేసుకోవడం మరిన్ని విమర్శలకు తావిచ్చింది. ఇప్పటివరకు రెండు విధాలుగా రూ.9కోట్ల వరకు ఆ సంస్థకు నిధులు చెల్లించారు. పని పూర్తి చేయకనే ఈ బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. పాలకవర్గంలోని కీలకనేతలే ఈ విమర్శలు చేయడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. డంపింగ్ యార్డు అవినీతి గురించి కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రస్తావించారు. అక్కడ ఎలాంటి అవినీతి జరగలేదని, కావాలంటే విచారణ చేయించాలని మేయర్ మహమ్మద్ వసీం సవాలు విసిరారు.

నిధుల కోసం ఒత్తిళ్లు..?

తమకు రావాల్సిన నిధుల కోసం నోవాగ్రీన్ సంస్థ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రూ.24 కోట్లకు సంబంధించిన బయోమైనింగ్ వర్క్‌లో ఇప్పటివరకు రూ.9 కోట్లు విడుదల చేసుకున్నారు. మిగిలిన రూ.15 కోట్ల నిధులను డ్రా చేసుకోవాలని ఆ సంస్థ చూస్తోంది. స్వచ్ఛభారత్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా బయోమైనింగ్ చేపట్టామని, బిల్లు చేయించాలని నగరపాలిక అధికారులను కోరుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబరు 17న జరిగిన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మరోసారి ఆ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ బిల్లుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రిమార్కులుంటే పూర్తి చేసి బిల్లు చేయాలని సూచించారు. తాజాగా కాన్ఫరెన్స్ సందర్భంలో సంబంధిత శాఖ మంత్రి నారాయణ సైతం ఈ బిల్లు పెండింగ్‌పై చర్చించినట్లు తెలిసింది. ఏమైనా ఉంటే విచారణ పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో డంపింగ్‌యార్డ్ అవినీతి ఆరోపణలు, పెండింగ్ బిల్లుల అంశం ఏమవుతుందోనన్న చర్చ జరుగుతోంది.



చింతకుంట వద్ద వ్యాపారులు రాక దున్నేసిన పంట

వ్యాపారుల దోపిడీ

- కరివేపాకు రైతులకు దగా
- పంట కొని.. డబ్బు చెల్లించని వైనం
- అడిగితే బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు
- రూ.15 కోట్లకుపైగా ఎగవేత

పుట్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కరివేపాకు రైతులను కొందరు వ్యాపారులు నమ్మించి నట్టేట ముంచుతున్నారు. కష్టపడి పండించిన పంటను కోసుకువెళ్లి.. డబ్బులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. పుట్లూరు మండలంలో సుమారు 20 మంది రైతులకు రూ.15కోట్ల వరకూ ఎగవేశారు. పుట్లూరు మండలంలోని చింతకుంట, బాలాపురం, పుట్లూరు, పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లి, చాగల్లు, ఉల్లికల్లు, తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, నార్పల మండలం నార్పల, మంగపట్నం తదితర గ్రామాల రైతులకు వ్యాపారులు భారీగా బకాయిలు ఉన్నారు. ఫోన్ చేసినా స్పందించడం లేదని, మరికొందరు బకాయి లేదని బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

నమ్మకంతో అమ్మకం

కరివేపాకు రైతులు అడ్వాన్స్ తీసుకోకుండా వ్యాపారులతో విక్రయ ఒప్పందాలు చేసుకుంటారు. టన్నుకు ఇంత ధర అని ముందుగానే మాట్లాడుకుంటారు. పంటను కోసేందుకు కూలీల ఖర్చు వ్యాపారులే పెట్టుకుంటారు. మార్కెట్‌లో పంట విక్రయించి, వారంలోగా డబ్బులు చెల్లిస్తామని నమ్మబలుకుతారు. ఆ తరువాత ఏళ్ల తరబడి డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నారు. బకాయి సొమ్ము అడిగితే.. 'బకాయి ఉన్నట్లు బాండ్ పేపర్లు ఉన్నాయా?' అని రైతులను దబాయిస్తున్నట్లు సమాచారం. గతంలో టన్ను కరివేపాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ పలికింది. అప్పట్లో వ్యాపారులు గ్రామాలకు వచ్చి పంటను కోసుకువెళ్లారు. ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకున్నారు. కానీ రైతులకు పైసా చెల్లించకుండా మోసగించారు.

సెటిల్‌మెంట్లు.. బెదిరింపులు..

పంటను విక్రయించిన రైతులకు వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. ఒక్కో రైతుకు లక్షల్లో బకాయి ఉన్నా, ఫోన్‌లు ఎత్తడం లేదు. ఒకే రైతుకు ఇద్దరు వ్యాపారుల నుంచి రూ.39 లక్షలకు పైగా రావాల్సి ఉంది. మరో రైతుకు ఒకే వ్యాపారి నుంచి రూ.18 లక్షలు రావాల్సి ఉంది. బాధిత రైతు అడిగితే, తాను ఇబ్బందుల్లో ఉన్నానని, రూ.లక్షకు రూ.18వేల ప్రకారం ఇస్తానని ఒప్పుకున్నట్లు సమాచారం. తాడిపత్రి మండలంలోని ఓ గ్రామంలో రైతుకు రూ.20 లక్షలు రావాల్సి ఉండగా, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ పెట్టారు. తనకు నష్టం వచ్చిందని, అంత ఇవ్వలేనని చెప్పిన వ్యాపారి.. తక్కువ మొత్తం ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు తెలిసింది. బెంగళూరుకు చెందిన వ్యాపారులే ఎక్కువగా బకాయి ఉన్నారని సమాచారం. రైతులు ఫోన్ చేస్తే.. కొందరు వ్యాపారులు బెదిరిస్తున్నారని సమాచారం.

బెదిరిస్తున్నారు..

తొమ్మిది ఎకరాల్లో కరివేపాకు సాగుచేశాను. మూడేళ్లపాటు బెంగళూరుకు చెందిన ఇద్దరు వ్యాపారులకు విక్రయించాను. వారి నుంచి రూ.40 లక్షలు రావాల్సి ఉంది. ఏటా రూ.10 లక్షలకు గాను రూ.లక్ష ఇచ్చి కాలం గడుపుతున్నారు. బెంగళూరుకు చెందిన కాట్రాజ్, మంజు కంపెనీ యజమానులకు ఫోన్ చేస్తే నన్నే బెదిరిస్తున్నారు. బాకీ లేదని, డబ్బులు ఇవ్వాలంటే బాండ్లు తెచ్చుకోవాలని దబాయిస్తున్నారు. ఈ ఏడాది కూడా పంటను సాగుచేశాను. కానీ వ్యాపారులు రాక దున్నేశాను.

- జయరామిరెడ్డి, చింతకుంట



రూ.18 లక్షలు రావాలి..

ఐదెకరాలను కౌలుకు తీసుకుని కరివేపాకు పంటను సాగుచేస్తున్నాను. బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తికి పంటను విక్రయించాను. రెండేళ్ల పంట డబ్బులు రూ.18లక్షల రావాల్సి ఉంది. అడిగితే అదిగో ఇదిగో అంటున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా దబాయిస్తే లక్షకు రూ.10వేలు ఇస్తానని చెబుతున్నాడు. ఆ డబ్బులతో అప్పులు సగం కూడా తీరవు. ఏం చేయాలో తోచడం లేదు. పంట సాగును విడిచిపెడదామని అనుకుంటున్నాను. ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- నాగరంగయ్య, బాలాపురం



పరిష్కారమే లక్ష్యం..!

- 20 నుంచి భూముల రీ సర్వే
- ప్రతి మండలంలో ఒక గ్రామం
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- మారిన భూ విస్తీర్ణం.. హద్దులు
- ఫిర్యాదులు స్వీకరించిన ప్రభుత్వం



ఆకాశవాణి కేంద్రం లో భూసమస్యలు వింటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మరోమారు సర్వే చేపడుతున్నారు. రైతుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన గ్రామాలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రీ సర్వే సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటి ఆధారంగా ఈ నెల 20 నుంచి రీ సర్వే ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

20వ తేదీ నుంచి..

జిల్లాలో ఈ నెల20 నుంచి రీ సర్వేను ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. జిల్లాలో 31 మండలాలు ఉండగా, ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేశారు. రాయదుర్గంలో జుంజరంపల్లి, కణేకల్లు మీన్లహళ్లి, డి.హీరేహాళ్ మండలంలో కడలూరు, బొమ్మనహాళ్‌లో కురవపల్లి, గుమ్మఘట్ట మండల కేంద్రం, ఉరవకొండలో వ్యాసాపురం, వజ్రకరూరులో గంజికుంట, విడపనకల్లులో ఉండబండ, బెళుగుప్పలో తగ్గుపర్తి, కూడేరులో జయపురం, కళ్యాణదుర్గంలో దురదకుంట, బ్రహ్మసముద్రంలో గుండిగానిపల్లి, కుందుర్పిలో అపిలేపల్లి, కంబదూరులో తిమ్మాపురం, శెట్టూరులో అయ్యగార్లపల్లి, గుంతకల్లులో శంకరబండ, గుత్తిలో శ్రీపురం, పామిడిలో కాళాపురం, బుక్కరాయసముద్రంలో రెడ్డిపల్లి గార్లదిన్నెలో కల్లూరు, శింగనమలలో మట్లగొంది, నార్పలలో బొందలవాడ, యల్లనూరులో గాండ్లపాడు, పుట్లూరులో పాతపల్లి, తాడిపత్రిలో ఊరు చింతల, పెద్దపప్పూరులో చిన్నఎక్కలూరు, పెద్దవడుగూరులో దిమ్మగుడి, యాడికిలో చందన, అనంతపురం రూరల్‌లో తాటిచెర్ల, ఆత్మకూరులో సనప, రాప్తాడులో బండమీదపల్లి గ్రామాలను రీ సర్వేకి ఎంపిక చేశారు.

పరిష్కారమే లక్ష్యం

వైసీపీ హయాంలో భూముల రీ సర్వే చేపట్టారు. రైతుల అభిప్రాయాలను తీసుకోకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరించి, రికార్డులకు ఎక్కించారు. దీంతో చాలా మంది రైతులు పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయారు. భూముల విస్తీర్ణం, సరిహద్దులలో తేడాలు వచ్చాయి. బాధిత రైతులు నెత్తీనోరు కొట్టుకున్నా వైసీపీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రీ సర్వేపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటి కోసం తొలుత ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా వేలల్లో ఫిర్యాదులు వచ్చాయి. ఇటీవల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఆ సమయంలోనూ రీసర్వే సమస్యలపై వేలల్లోనే ఫిర్యాదులు వచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 5 వేల వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించారు. సగానికి పైగా అలాగే ఉండిపోయాయని అధికారులు అంటున్నారు. రీ సర్వేతో ఆ సమస్యలు కూడా పరిష్కారమౌతాయని అంటున్నారు.

అత్యంత జాగ్రత్తగా...

రీ సర్వే కారణంగా భూ సమస్యలు తలెత్తాయి. వాటి పరిష్కారం కోసం మరోమారు రీ సర్వే చేపడుతున్నాం. జిల్లాలో పైలెట్‌గా 31 గ్రామాలను ఎంపిక చేశాము. ఈ నెల 20 నుంచి రీ సర్వే మొదలౌతుంది. ప్రతి గ్రామానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశాము. ఈ సర్వేని అత్యంత జాగ్రత్తగా చేపడుతున్నాం.

- శివనారాయణశర్మ, జాయింట్ కలెక్టర్



మాన్యం.. బేరం..?



విక్రయానికి సిద్ధం చేసిన చెన్నకేశవస్వామి మాన్యం భూమి

యాడికి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ మాన్యం భూమిని కొందరు అమ్మకానికి పెట్టారు. ఆ స్థలం తమదేనని శుభ్రం చేస్తున్నారు. చెన్నకేశవ స్వామి ఆలయ భూములు 350 ఎకరాలకు పైగా ఉండేవి. అన్యాక్రాంతం తరువాత వంద ఎకరాలు మిగిలాయి. ఉన్నవాటిపైనా కొందరు కన్నేశారు. 'స్వామి వారి సన్నిధిలో నాట్యం చేసే వారి కోసం' అని డైక్లాట్‌లో పొందుపరిచిన సర్వే నంబరు 550లోని 7.16 ఎకరాలకు ఎసరు పెట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత భూముల జాబితాలో ఉన్నా, అగ్రిమెంట్ల ద్వారా అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఆ భూమికి పక్కనే కొత్తగా హౌసింగ్ కాలనీ ఏర్పాటైంది. దీంతో స్వామివారి భూమి విలువ ఎకరం రూ.కోటి పలుకుతోంది. అది చెన్నకేశవస్వామి మాన్యం అని, 22(ఏ) జాబితాలో ఉందని ఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆ భూమి క్రయ, విక్రయాలు చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. ఆ భూమిని శుక్రవారం పరిశీలిస్తామని, అన్యాక్రాంతం కాకుండా చూస్తామని అన్నారు.

లఘుచిత్రోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా



లఘుచిత్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అనంతలో నిర్వహించనున్న 7వ లఘుచిత్రోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం ఆ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లఘుచిత్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రషీద్‌బాషా మాట్లాడుతూ లఘుచిత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించి నటీనటులు, దర్శక నిర్మాతలు రూపొందించిన లఘుచిత్రాలను ఈనెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు మొమెంటోలు, సర్టిఫికెట్లతో సత్కరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జీఎంఎస్ గ్యాలరీ సొసైటీ సహకారంతో రూ.50వేల వ్యయంతో అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో లఘుచిత్రం రూపొందిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల కళాకారులు సైతం తమ లఘుచిత్రాలను పోటీలకు పంపవచ్చునన్నారు. వివరాలకు 7288022467, 9676350681 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మురళీధర్, షార్ట్‌ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి రమేష్, సభ్యులు తోట బాలన్న, కత్తి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

అనంతపురం కల్చరల్/సెంట్రల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో అప్రెంటీస్‌షిప్ కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ గురువారం విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులు పదోతరగతి ఒరిజినల్, ఐటీఐ, కులధృవీకరణ పత్రం, పాన్‌కార్డు, బ్యాంకుఖాతా పాస్‌బుక్, 2 పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్సు రెండు సెట్లు చొప్పున తీసుకుని ఈనెల 21న ఉదయం 9 గంటలకు కర్నూలులోని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాలన్నారు.

ట్రేడ్‌ల వారీగా ఎంపికైన అభ్యర్థుల సీరియల్ నంబర్లు ఇలా...

డీజిల్ మెకానిక్స్: 11, 17, 33, 40, 41, 55, 58, 60, 77, 78, 83, 90, 92, 97, 98, 100, 101, 120, 131, 135, 142, 156, 157, 169, 170, 173, 184, 186, 191, 204, 208, 210, 218, 211, 224, 225, 236, 238.

మోటర్ మెకానిక్ : 4, 47, 48.

ఎలక్ట్రీషియన్ : 56, 58, 217, 235, 257.

ఫిట్టర్ : 35.

డ్రాఫ్ట్‌మ్యాన్ (సివిల్) : 15.

22న తహసీల్దారుకు అర్జీలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, జనవరి16(ఆంధ్రజ్యోతి): రెండు సెంట్ల స్థలం, రూ.4 లక్షల ఇంటి రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీన జనం తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ గురువారం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలలో ఇల్లు లేనివారికి 2 సెంట్ల స్థలంతోపాటు రూ.4 లక్షల హౌసింగ్ రుణాలను ఇస్తామని ప్రకటించిన మేరకు అర్హులైన ప్రజల నుంచి తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించే కార్యక్రమానికి తమ పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ మేరకు ఇల్లు లేనివారు రావాలని కోరారు.

డీఎల్‌పీఓ సుమన జయంతి బదిలీ



సుమన జయంతి..

అనంతపురం న్యూటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) సుమన జయంతి బదిలీ అయ్యారు. డిప్యూటేషన్‌పై బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. బుధవారం ఉత్తర్వులు జారీ కావడంతో రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో ఏఓ సోమశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ డీఎల్‌పీఓగా విజయ్ కుమార్‌రెడ్డిని నియమించే అవకాశం ఉంది.

34 కేంద్రాల్లో నవోదయ పరీక్షలు

● **డీఈఓ ప్రసాద్‌బాబు**



అనంతపురం విద్య, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం తెలిపారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ భవన్‌లో పరీక్షల విధులకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్స్, సెంట్రల్ లెవల్ అబ్జర్వర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పరీక్షలకు 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో బాలురు 4,556 మంది, బాలికలు 3431 మంది ఉన్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 15 పరీక్షా కేంద్రాల్లో, శ్రీసత్యసాయి జిల్లాలో 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ పరీక్ష ఉంటుందని అన్నారు. పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏసీ గోవింద్ నాయక్, నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచుకొండల్లో జవాను మృతి

నీ త్యాగం.. అమరం..

ఊపిరి అందక ఆగిన గుండె

నేడు బసినేపల్లిలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



జవాను వెంకట రమణారెడ్డి (ఫైల్)

"మంచుకొండల్లో.. గడ్డకట్టే చలితో.. పోరాడింది ఆ గుండె..

"ఊపిరి బిగబట్టుకుని.. హిమపాతానికి ఎదురొడ్డింది ఆ గుండె..

"ఊపిరి ఆడకున్నా.. ప్రాణమే పోతున్నా.. లెక్క చేయలేదు ఆ గుండె..

"దేశ ప్రజల కోసం.. పహారా కాస్తూనే... ఆగిపోయింది.. ఆ గుండె..

"ఓ వీరుడా.. నీ పోరాటం.. అమరం.. నీ త్యాగం.. అమరం..



మంచుకొండల్లో మృతిచెందిన జవాను వెంకటరమణా రెడ్డి

ధర్మవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం.. దేశ ప్రజల కోసం.. మంచుకొండల్లో పహారా కాస్తూ.. జవాను అమరుడయ్యారు. ధర్మవరం పట్టణం నాగులబావి వీధికి చెందిన బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణా రెడ్డి(40) విధి నిర్వహణలో ఈనెల 15న గుండెపోటుతో మృతిచెందారు. వెంకటరమణారెడ్డి 2003లో బీఎస్ఎఫ్‌లో చేరారు. 22ఏళ్లుగా పనిచేస్తున్నారు. కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందారు. ఉష్ణోగ్రతలు పడిపోయి, ఊపిరి అందక మృతిచెందినట్లు బీఎస్ఎఫ్ అధికారులు.. బంధువులకు సమాచారం. వెంకటరమణారెడ్డికి భార్య హరిప్రియ, కుమారుడు మహీధర్ రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణా రెడ్డి పార్థివదేహం గురువారం రాత్రి ధర్మవరం పట్టణానికి చేరుకుంది. కశ్మీర్ నుంచి బెంగళూరుకు ఆర్మీ అధికారులు ఆయన పార్థివదేహాన్ని తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిలటరీ వాహనంలో ధర్మవరానికి తరలించారు. మరికొన్ని రోజుల్లో రిటైర్ కానున్న ఆయన ఇలా మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. వెంకటరమణారెడ్డి స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి కాగా.. కొన్నేళ్లుగా ధర్మవరంలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం బసినేపల్లిలో అధికార లాంఛనాలతో జవాను అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ముందు చూపు ఏదీ..?

వంకల పాలవుతున్న కుడికాలువ నీరు



కుడికాలువ నుంచి వృథాగా బయటకు వెళ్తున్న నీరు

ఇరిగేషన్ అధికారుల ముందుచూపు లేక కుడికాలువలో నీరు పెద్ద ఎత్తున్న వృథాగా వంకల పాలవుతోంది. కుడికాలువకు నిర్మించిన యూటీ (అండర్ బ్రిడ్జి)లకు పెద్ద ఎత్తున్న రంధ్రాలు పడి నీరు బయటకు వెళ్తోంది. పీఏబీఆర్ డ్యాం నుంచి 30 కిలోమీటర్లలోపు ఉన్న యూటీల నుంచి నీరు వృథా అవుతోంది. డ్యాం సమీపంలోని బుడగొని వంక, హంసపల్లి, జల్లిపల్లి గ్రామాల మధ్య గొరవయ్య దార్ల వంకల వద్ద నీరు భారీగా బయటకు వెళుతోంది. అధికారులు నీటి వృథాను అరికట్టడంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఏబీఆర్‌లోకి తుంగభద్రం డ్యాం నుంచి 530 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇన్‌ఫ్లో ఆధారంగా కుడికాలువకు 705 క్యూస్కెల నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. కాలువపై పర్యవేక్షణ లేకపోవడంతోనే లీకేజీలను గుర్తించలేకపోయారన్న వాదనలు వినవస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, కూడేరు

మద్యం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

గోరంట్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయి సోమశేఖర్‌కు పెనుకొండ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ గురువారం తెలిపారు. 2020 జూలై 18న కర్ణాటకలోని మార్గానికుంట్లకు చెందిన సోమశేఖర్ 122 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు తీసుకెళ్తుండగా అప్పటి సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టుచేసి, కేసు నమోదు చేశారు. పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణలు సాగాయి. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి బొజ్జప్ప మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

రేపు కర్ణాటక సంగీత కచేరి

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని విజయవాణి సంగీత కళాశాల ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం కర్ణాటక సంగీత కచేరీ నిర్వహిస్తున్నామని కళాశాల నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ గురువారం తెలిపారు. త్యాగరాజస్వామికి శనివారం ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, సంగీత విద్వాంసులచేత సామూహిక పంచరత్న గాన సేవలు ఉంటాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు తమిళనాడుకు చెందిన అక్కచెల్లెళ్లు కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహిస్తామని తెలిపారు.

పురం వైసీపీలో కన్వీనర్ల చిచ్చు

ఏకపక్ష నిర్ణయంపై ఒక వర్గం గుర్రు

పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసిన నాయకులు

ఇప్పట్లో ఇన్‌చార్జి మార్పు లేనట్లేనా?



హిందూపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీలో మండల కన్వీనర్ల చిచ్చు మరోసారి తెరపైకి వచ్చింది. మొన్నటి వరకు ఉన్న కన్వీనర్లను పక్కన బెట్టి వైసీపీ పురం ఇన్‌చార్జి దీపిక వర్గానికి చెందిన నాయకులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ఏకపక్షంగా సాగిందనీ, కన్వీనర్ అంటే ఏమిటో విలువ తెలియకుండా పదవులు అప్పగించారంటూ మరోవర్గం నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. నియోజకవర్గంలో మూడు మండలాలు, పట్టణం ఉంది. ఇందులో పట్టణానికి సంబంధించి కన్వీనర్లతో పాటు మూడు మండలాలకు కన్వీనర్లను ఎంపిక చేశారు. వీరిలో అందరూ దీపిక వర్గం వారే. నవీన్‌నిశ్చల్ వర్గీయులు ఒక్కరు కూడా లేరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లేపాక్షి మండల కన్వీనర్ విషయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇచ్చిన మాట కూడా బేఖాతరు చేస్తూ మరొకరికి ఇచ్చారని నవీన్ వర్గీయులు రగిలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నవీన్ వర్గీయులు కొంత మంది ఎంపీ మిథున్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసి ఎంపీపీ విషయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చాయో బయటకు పొక్కడంలేదు. ఇప్పట్లో ఇన్‌చార్జి మార్పు లేదంటూ చర్చించుకుంటున్నారు. మార్పు చేస్తే ప్రస్తుతం ఎంపిక చేసిన కన్వీనర్లు తప్పించే ఆస్కారం లేనట్లే.

పార్టీని వ్యతిరేకించినా..

నియోజకవర్గంలో మూడు మండలాలు, ఒక పట్టణానికి సంబంధించి ఐదుగురు కన్వీనర్లను ఎంపిక చేశారు. ఆ జాబితాను ఈనెల 10న అధిష్టానం ప్రకటించింది. ఈ పేరును ముందస్తుగా అధిష్టానానికి పంపగా.. అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హిందూపురం రూరల్ మండల కన్వీనర్ మినహాయించి నలుగురూ కొత్త వారే. ఇందులో ఒకరిద్దరు కన్వీనర్లు పార్టీకి పెద్దగా కష్టపడిన దాఖలాలు లేవని కొంతమంది పార్టీకి వ్యతిరేకించినా అలాంటివారిని ఎంపిక చేయడం ఏంటని ఎంపీ మిథున్‌రెడ్డి వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఇందులో ఒక కన్వీనర్ వైసీపీ అధికారంలో ఉన్నపుడు విచ్చలవిడిగా వ్యవహరించారనీ, అతడి వల్ల పార్టీకి చెడ్డపేరు వచ్చిందని అలాంటి వ్యక్తిని ఎంపిక చేయడం ఏంటని వాపోతున్నారు. ఇప్పటికే సదరు నాయకుడిని సొంత పార్టీ నాయకులే టార్గెట్ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆయన చేసిన దందాలు, దౌర్జన్యాలు మరిచిపోలేదు. దీంతో అలాంటి వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని సొంత పార్టీ నాయకులే అంటున్నారు. దీంతోపాటు ఓ మండలానికి సంబంధించి ఓ నాయకుడిని సుదీర్ఘ కాలంగా కన్వీనర్ పదవి ఊరిస్తోంది. ఆయన 2013 నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. అతడిపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు ముందు అతడిని కన్వీనర్ చేస్తారని అప్పట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూడా ఆయనను కన్వీనర్ చేస్తారని ఆశించారు. ఈ పరిస్థితుల్లో మండల కన్వీనర్ తనకు పదవి వద్దని ఆ నాయకుడికి ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతో అతడికి కన్వీనర్ పోస్టు ఇవ్వడానికి లైన్ క్లియర్ అయిందని భావించారు. ప్రస్తుత ఎంపికలో అతడి పేరు లేదు. మరో మండలానికి చెందిన కన్వీనర్ ఎంపికలో కూడా ఏకపక్షంగా వ్యవహరించారని స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. సదరు నాయకుడు విచ్చలవిడిగా వ్యవహరించారు. ఈ పరిస్థితుల్లో అతడి ఎంపిక మెజార్టీ నాయకులకు మింగుడు పడటంలేదు. ఆయన కన్వీనర్‌గా ఎలా రాణిస్తారో వేచిచూడాల్సిందే.

మార్పు లేనట్లేనా?

ఇటీవల ఓ వర్గం నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో కన్వీనర్ల ఎంపికపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ సందర్భంగా పురంలో వైసీపీ ఇన్‌చార్జిని మార్చాలని అడిగినట్లు సమాచారం. ఇప్పట్లో ఇన్‌చార్జిలను మార్చే ఉద్దేశంలేదనీ, 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌చార్జిల మార్పు ఉంటుందని అంతవరకు ఆగాల్సిందేనంటూ సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఓ వర్గం నాయకులు నియోజకవర్గ విభజన జరిగితే తమ నాయకుడికి అవకాశం వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు సదరు నాయకుడికి ఇన్‌చార్జి పదవికోసం తీవ్రంగా శ్రమిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎంపీ మాటలతో ఆ వర్గంలోని నాయకులకు నిస్సహాయత నెలకొంది. ఈ పరిస్థితుల్లో కన్వీనర్ల ఎంపిక ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న చర్చ సాగుతోంది.

రోడ్డు భద్రత మాసోత్సవాలను పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్



రోడ్డుభద్రత మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు, అసిస్టెంట్ కలెక్టరు ఇతర అధికారులు

అనంతపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డుభద్రత మాసోత్సవాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలలో ఒక ప్రాణం పోయినా తిరిగి రాదని, ఆ కుటుంబం అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అందుకే రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫిబ్రవరి 15వరకు మాసోత్సవాలను పక్కా ప్రణాళికతో చేపట్టాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని, అతివేగంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపేవారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్‌స్పాట్‌లను జాయింట్ యాక్షన్ కమిటీ పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 24న డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేయించాలని, 25న ప్రమాదాల నివారణ కార్యక్రమాల నిర్వహణ, 26, 27 తేదీలలో ప్రజాప్రతినిధులతో కలిసి వాకథాన్, 30, 31న ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, డీటీసీ వీర్రాజు, డీఎంహెచ్ఓ డాక్టరు రవికుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓలు లక్ష్మీనారాయణ, రమేష్, ఎంపీడీవోలు శ్రీనివాసులు, సునీత, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ జుత్తు కత్తిరింపుపై ఎస్పీ సీరియస్



పెనుకొండ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళ జుత్తు కత్తిరింపుపై ఎస్పీ రత్న సీరియస్ అయ్యారు. మండలంలోని మునిమడుగు గ్రామంలో ప్రేమ జంటకు సహకరించిందన్న అనుమానంతో వెంకటలక్ష్మిపై యువతి బంధువులు దాడిచేసి, జుత్తును కత్తిరించిన విషయం తెలిసిందే. దీనిపై బాధితురాలు కియ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై జిల్లా ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించారు. దీంతో ఎస్పీ గురువారం మునిమడుగు గ్రామంలో పర్యటించారు. వివరాలను ఆరాతీయడంలో నిమగ్నమయ్యారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదు: రాఘవన్, సీఐ

మునిమడుగులో మహిళ జుత్తు కత్తిరించడంపై 13 మందిపై కేసు నమోదు చేశాం. పూర్వాపరాలను పరిశీలిస్తున్నాం. త్వరలో నిందితులను అరెస్టు చేస్తాం. దీని వెనుక ఎంతటివారున్నా ఉపేక్షించే ప్రసక్తే లేదు.

కఠినంగా శిక్షించాలి: ఐద్వా

అనంతపురం కల్చరల్: పెనుకొండ మండలంలో మహిళను వివస్త్రను చేసి, జుట్టు కత్తిరించినవారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి గురువారం డిమాండ్ చేశారు. ప్రేమజంటకు సహకరించారనే నెపంతో మహిళను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించడం అనాగరికమని అన్నారు. ఆమె తప్పు చేసివుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా చేయడం మహిళలను అవమానించడమేనని అన్నారు. దాడిచేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆమెకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళనకరమని అన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని, ఈ ఘటనపై ఎస్పీ సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆ జీఓతో వేతనం వెతలు

అడ్డగోలుగా 'వైసీపీ' జీవో 11 అమలు

గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులకు చుక్కలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తీసుకున్న నిర్ణయాలు పంచాయతీ కార్యదర్శులకు చుక్కలు చూపుతున్నాయి. చాలామంది నెలల తరబడి వేతనం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. బాధిత సిబ్బంది డీపీఓ చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉండేలా వైసీపీ ప్రభుత్వం జీఓ నంబర్ 11ను జారీ చేసింది. చాలా చోట్ల ఈ జీవో అమలు కాలేదు. కానీ జిల్లాలో అప్పటి డీపీఓ ప్రభాకర్‌రావు అమలు చేశారు. గ్రేడ్-5 కార్యదర్శులను డీడీఓ పవర్ ఉండే స్థానంలో నియమించే వెసులు బాటు లేదు. అయినా గ్రేడ్-4 అడిషినల్ పేరుతో నియమించారు. దీంతో బదిలీల ప్రక్రియలో సీనియర్ సెక్రటరీలు బలయ్యారు. రెండు నెలలు వేతనం లేక ఇబ్బందులు పడ్డారు. సీనియర్‌లు తిరిగి డీడీఓలుగా చేరడంతో 'గ్రేడ్-4 అడిషినల్' కింద వచ్చినవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో డీడీఓ పవర్ ఉన్న సీనియర్ సెక్రటరీలు బదిలీల్లో భాగంగా నియమితులైన వారిని ఎగ్జిట్ చేశారు. వారికి మరోచోట స్థానం లేక వేతనం తీసుకోలేని పరిస్థితి ఎర్పడింది. ఐదు నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు.

పరిష్కారం ఎప్పుడు..?

వేతనం తీసుకోలేని వారు గ్రేడ్-4 అడిషినల్ కింద 73 మంది ఉన్నారు. జిల్లాలో 1044 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 500 లోపు జనాభా ఉన్నవి నాలుగు పంచాయతీలు. ఇవి మినహా 1040 గ్రామ పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శులు 49 మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 18 మంది, గ్రేడ్-3 కార్యదర్శులు 115 మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 368 మంది ఉన్నారు. వీరిలో ఎవరికి డీడీఓ పవర్స్ ఇచ్చి బదిలీ చేసినా సమస్యలు వచ్చేవి కావు. కానీ గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4 అడిషినల్ కింద చూపించి బదిలీలు చేపట్టారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ కార్యాలయానికి ఫైల్ పంపి, అక్కడి అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి. కానీ ఆ పనినీ వాయిదా వేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి గురువారం తీసుకెళ్లినట్లు తెలిసింది. కలెక్టర్ ద్వారా కమిషనర్ కార్యాలయానికి సిఫార్సు చేయించి, సమస్యను పరిష్కరిస్తారా, లేదా.. చూడాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

వ్యాసరచనలో విజయసాయికి మొదటి బహుమతి

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్‌ను మొదటి బహుమతి వరించింది. ఈ మేరకు భీమవరానికి చెందిన ఉమర్ అలీషా సాహితీ సమితి ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 250 మంది తమ వ్యాసాల ను పంపారని తెలిపారు. వాటిలో విజయసాయి కుమార్ రాసిన 'అలీషా రచనలు బర్హిని దేవి పద్యకావ్యం' మొదటి బహుమతికి ఎంపికైందన్నారు. ఈనెల 23న భీమవరంలో నిర్వహించే సాహిత్యసభలో విజయసాయికుమార్‌కు డాక్టర్ ఉమర్ అలీషా చేతులమీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు'

గార్లదిన్నె, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా హెచ్చరించారు. మండల పరిధిలోని కోటంక గ్రామంలో ఈనెల 20, 21న ఊరు దేవర జరుగుతుండడంతో, ఎస్ఐ గురువారం సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

రాజేశ్వరరావుకు యంగ్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆశావాది రాజేశ్వరరావు

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కార్పొరేట్ హెచ్ఎస్ఎస్ఈ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆశావాది రాజేశ్వరరావు యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ విపత్తుల నిర్వహణ మండలి అందించే డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఎక్సలెన్సీ అవార్డ్స్-2024లో భాగంగా ఆశావాది రాజేశ్వరరావు యంగ్ అచీవర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండి వేదికపై బుధవారం రాత్రి కేంద్ర మంత్రి పియూష్ గోయల్ చేతులమీదుగా రాజేశ్వరరావుకు అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత జస్టిస్ ఎంఎం కుమార్, సంజయ్ కుమార్, ఆచార్య ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో టూటౌన్ పోలీసులు గురువారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సాయినగర్ మొదటి క్రాస్ రామన్ స్కూల్ సమీపంలో బొలెరో వాహనంలో తరలిస్తుండగా టూటౌన్ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. అందులో ఉన్న 45 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం బుగ్గపల్లికి చెందిన గుడిపాటి హరికృష్ణ, సాయినగర్ మొదటి క్రాస్‌కు చెందిన పసుపుల సురేష్‌ను అరెస్టు చేశారు. దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

అనంతపురం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో జూదమాడుతున్న ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శాంతిలాల్ ఆదేశాల మేరకు గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలోని ముళ్లపొదల్లో పేకాడుతున్న ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకున్నారు.

లభించని యువకుడి ఆచూకీ



శశాంక్‌రెడ్డి (ఫైల్)

అనంతపురం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీలో పడి గల్లంతైన యువకుడి ఆచూకీ గురువారం కూడా లభించలేదు. నగరంలోని నీరుగంటి వీధికి చెందిన సాయి శశాంక్‌రెడ్డి (28) బుధవారం హెచ్చెల్సీలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. అతడు బుధవారం నగరంలోని తన స్నేహితులైన కౌశిక్, శ్రీకాంత్ రెడ్డితో కలిసి మద్యం తాగాడు. సాయంత్రం సుఖ్‌దేవ్‌నగర్ పరిధిలో వెళ్తున్న హెచ్చెల్సీ పక్కనే కూర్చున్నారు. ఈ క్రమంలో కాలువలో పడి కొట్టుకు పోయినట్లు స్నేహితులు ఫోర్త్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఫోర్త్‌టౌన్ ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభ్యంకాలేదు. అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

శింగనమల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోదనపల్లిలో కర్రి సూర్యనారాయణ అనే గొర్రెల కాపరికి చెందిన 24 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. గ్రామానికి చెందిన కర్రి సూర్యనారాయణ గ్రామానికి సమీపంలోని పెద్దకుంట వద్ద దొడ్డిలో గొర్రెల మంద నిలిపేవాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం గొర్రెలను మేతకు తోలుకెళ్లే సమయంలో 24 గొర్రెల పిల్లలను ఇనుప కంచె మధ్యలో వాటిని వదిలి వెళ్లాడు. అయితే కాపరి సాయంత్రం తిరిగి వచ్చి చూడగా.... 24 గొర్రెల పిల్లలను కుక్కలు దాడి చేసి చంపినట్లు గుర్తించాడు. దీంతో రూ. 1.50 లక్షకుపైగా నష్టం వాటిల్లిందని బాధిత కాపరి కన్నీరమున్నీరుయ్యాడు. అతడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని తోటి గొర్రెల కాపరులు కోరారు.



మృతి చెందిన గొర్రెపిల్లల వద్ద కాపరి

బాగుపడిన గ్రామీణ రోడ్లు

● ప్రజలు, వాహనదారుల్లో హర్షం



తారు రోడ్డు వేయక మునుపు మరూరు-చెర్లోపల్లి దారి



ఇటీవల నిర్మించిన తారురోడ్డు

రాప్తాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో గ్రామాల రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, గుంతల రోడ్ల స్థానంలో తారురోడ్లు నిర్మిస్తుండడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. మండలంలోని మరూరు నుంచి చాపట్లకు, మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి మీదుగా పాలబావికి తారురోడ్ల నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో 2018లో అప్పటి మంత్రి పరిటాల సునీత నిధులు మంజూరు చేయించారు. రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయా గ్రామాల తారురోడ్ల పనులు నిలిచిపోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గ ప్రజాప్రతినిధి తారురోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ప్రజలు పలు మార్లు విన్నవించినా రోడ్లు వేయిం చలేదు. దీంతో ప్రజలు ఐదేళ్లు గుంతల దారిలో రాకపోకలు సాగిం చేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతల రోడ్లలో వా హన దారులు ప్రమాదాలకు కూడా గురయ్యారు.

కూటమి ప్రభుత్వంతో మహర్దశ

2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాగానే చాపట్ల, ఎం. చెర్లోపల్లి, పాలబావి రోడ్లకు మహర్దశ వచ్చింది. ఎన్నికల ప్రచార సమయంలో ఆయా గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మరూరు నుంచి చాపట్లకు 3 కి.మీ తారురోడ్డు నిర్మాణానికి రూ.1.59 కోట్లు మంజూరు చేయించగా పనులు పూర్తి చేశారు. మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి, మారెమ్మ ఆలయం వరకూ 9 కి.మీ తారురోడ్డు నిర్మాణానికి రూ. 4.96 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే మరూరు నుంచి చెర్లోపల్లికి తారురోడ్డు నిర్మించారు. ఇక చెర్లోపల్లి నుంచి పాలబావికి రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏన్నో ఏళ్ల తర్వాత తమ గ్రామాలకు తారురోడ్డు నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హామీ నెరవేర్చారు



మరూరు నుంచి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇన్నాళ్లు చాల ఇబ్బందులు పడ్డాం. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు రోడ్ల గురించి పట్టించ ఎకోలేదు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారంలోకి రాగానే మా గ్రామానికి తారురోడ్డు వేయించారు. గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- కుమార్, చాపట్ల**

గుంతల దారిలో ఇబ్బందులు పడ్డారు



మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి గ్రామాలకు వెళ్లే దారి గుంతల మయంగా ఉండేది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు రోడ్డు వేయించలేకపోయారు. దీంతో ఐదేళ్లు ప్రజలు గుంతల దారిలో ప్రయాణం సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారంలోకి వచ్చిన వెంటనే తారురోడ్డు వేయించారు. ఎమ్మెల్యేకి ప్రత్యేక కృజ్ఞతలు.

- బాబాయ్య, చెర్లోపల్లి

నాడు అధ్వానం... నేడు అద్భుతం..

● రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామం నుంచి తోపుదుర్తికి వెళ్లే దారి గతంలో చాలా అధ్వనంగా ఉండేది. దారంతా రాళ్లు, గుంతలతో ఉండేది. ఆ దారి గుండా రైతులు పొలాలకు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల్లో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బుక్కచెర్ల నుంచి 2 కిలోమీటర్లు (బుక్కచెర్ల పొలిమేర వరకు) 24 అడుగుల వెడల్పుతో మట్టి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో కాంట్రాక్టర్ ఓబిలేసు రోడ్డు బాగు చేయించారు. పొలాలకు వెళ్లేదారి ఇప్పుడు బాగుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బుక్కచెర్ల - తోపుదుర్తి రోడ్డు నాడు అలా...



ఇప్పుడు ఇలా...

భూ సమస్యలను పరిష్కరిస్తాం: కలెక్టర్



రైతుల భూ సమస్యలు వింటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆకాశవాణి కేంద్రంలో గురువారం ఉదయం గంటపాటు 'అనంత మిత్ర' ఫోన్ ఇన్‌లో ఆయన పాల్గొన్నారు. తాడిపత్రి, కంబదూరు, బుక్కరాయసముద్రం తదితర ప్రాంతాల నుంచి 12 మంది రైతులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలను వివరించి, న్యాయం చేయాలని విన్నవించారు. కలెక్టర్ సావధానంగా వింటూ, సలహాలు ఇస్తూనే పరిష్కారానికి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో అనేక తప్పులు జరిగాయనే ఫిర్యాదులు రైతులనుంచి వస్తున్నాయని, వాటిని సరిచేయడానికి మళ్లీ రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం కూడా కొనసాగాయి. ఎస్పీ జగదీష్ దగ్గరుండి సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు సాగేలా చర్యలు చేపట్టారు. ఎత్తు, ఛాతీ కొలతల అనంతరం 100, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలలో పురుష అభ్య ర్థులు పాల్గొన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 17, 18, 20 తేదీలలో నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. అప్పీలు అభ్యర్థులు ఈ నెల 21న హాజరు కావాలన్నారు.

చెత్తతో సంపద కేంద్రం పరిశీలన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

నార్పల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని గురువారం జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొని రావాలని స్థానిక అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు పొడి చెత్త, తడి చెత్తపై అవగాహన కల్పించి, మండలంలో పనిచేయని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచు సుప్రియ, ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్డీ శైలజారాణి, కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా పుట్టకనుమ ఘాట్ రోడ్డు

కనగానపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టకనుమ ఘాట్‌రోడ్ ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలిచింది. భానుకోట గ్రామ సమీపంలో పుట్టకనుమ ఘాట్‌రోడ్ ఉంది. ఈ రహ దారి గుండా ప్రతిరోజు వందలు వాహనాలు ధర్మవరం, తరగరకుంట, కళ్యాణదుర్గం మీదుగా వెళుతుంటాయి. ఘాట్‌రోడ్డు వద్దకు రాగానే వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మలుపు ఎక్కువగా ఉండటం, వన్‌వే కావడంతో పాటు, వర్షాలకు రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా రాత్రివేళల్లో జరుగుతున్నాయని, ఇందుకు ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడం కూడా కారణమంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి, సూచికా బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు

కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి: సీపీఎం



జేడీఏకి వినతిపత్రం అంజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం రూరల్/అర్బన్/విద్య, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంది కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. గురువారం రూరల్ మండలంలోని కందు కూరులో కంది పంట విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులను సీపీఎం జిల్లా ప్రతినిధి బృందం కలిశారు. రైతులు శివా రెడ్డి, రామ్మోహన్, రాము, రామచంద్ర, ఆది నారాయణతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లలో కంది పంట సాగు చేయగా, 80వేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు అంచానవేశారన్నారు. కంది పంట దిగుబడిని సకాలంలో అమ్ముకోవ డానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. ప్రభుత్వం కంది పంటకు గిట్టుబాటు ధర రూ.7550 ప్రకటించిందని, అది సరిపోద న్నారు. అదనంగా రూ.2వేలు కలపాలన్నారు. ప్రభుత్వం వెంటనే కంది పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను కలిసి వినతిప త్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బాలరంగయ్య, తరిమెల నాగరాజు, భాస్కర్, వలి, సంజీవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం..

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి జిల్లా రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం కందిపంట కోతకు వచ్చిందని, అయితే ఇక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.2వేలు జమచేసి, రూ.9550కు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇజ్‌తెమా ఏర్పాట్ల పరిశీలన



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, జనవరి16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నార్పల క్రాసింగ్ వద్ద 18 ఎకరాల విస్తీర్ణంలో ఈనెల 18, 19 తేదీలలో జరిగే ఇజ్‌తెమా ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెతో ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ... 12 సంవత్సరాల తరువాత నార్పలలో ఇజ్‌తెమా ఏర్పాటు చేశామని, ఇందులో 25వేల 30వేల మంది పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇజ్‌తమా కార్యక్రమానికి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా, అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్‌లను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. అనంతరం నార్పలలోని మురుగు కాలువను పరిశీలించారు. త్వరలోనే కాలువ నిర్మాణం పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నార్పలలో వీధి లైట్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని పంచాయతీ అధికారుల పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్పలలో గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, డీప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసమూర్తి, సీఐ కౌలుట్లయ్య, టీడీపీ నాయకులు ఆలం నాగార్జున, ఆకుల ప్రసాద్, ఆకుల విజయ్‌కుమార్ బాబు, పరంధామ, సాలేహా, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఏర్పాట్లు

అనంతపురం అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కి టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. గురువారం పలువురు టీడీపీ నాయకులు స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుభ్రం చేయించారు. అలంకరణ చేసేందుకు అన్ని పనులు సిద్ధం చేశారు. అలాగే ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు సరిపూటి రమణ, రాయల్ మురళి, నారాయణస్వామి యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, లక్ష్మీనరసింహ, మణికంఠ బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆవరణం శుభ్రం

అనంతపురం అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవతో స్థానిక ఆరో రోడ్డులోని శ్మశాన వాటిక ఆవర ణం శుభ్రమైంది. ఆయన ఇటీవల కాలనీల పర్యటనకు వెళ్లిన సమయంలో స్థానికులు ఆరో రోడ్డు శ్మశాన వాటిక ఆవరణం అపరిశుభ్రంగా ఉందని, శుభ్రం చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం నగర పాలక సంస్థ సిబ్బంది శ్మశాన వాటికలోని ముళ్ల చెట్లు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

కాలువ నీటి వృథాను అరికట్టాలి

●ఎస్‌ఈకి పండ్లతోటల రైతుసంఘం నాయకుల వినతి



పీఏబీఆర్ కుడికాలువను పరిశీలిస్తున్న పండ్లతోటల రైతుసంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు అక్రమంగా తవ్విన గండ్లను పూడ్చి నీటి వృథాను అరికట్టాలని జిల్లా పండ్ల తోటల రైతు సంఘం నాయకులు కోరారు. ఆ సంఘం నాయకులు గురువారం పీఏబీఆర్ కుడికాలవను జీడిపల్లి నుంచి పొట్టిచెరువు, కూడేరు, హంపాపురం, గొల్లపల్లి జాతీయ రహదారి వరకు పరిశీలించారు. ఉదిరిపికొండ, వడ్డిపల్లి వద్ద కాలవ గట్టుకు అనధికారికంగా అక్రమంగా కొట్టిన గండ్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రమంగా కొట్టిన గండ్లను పూడ్చి పీఏబీఆర్ కుడికాలవ చివరి ఆయకట్టు వరకు, కాలవ పొడవున ఉన్న చెరువులకు నీరందించాలని కోరారు. జిల్లాలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలన్నారు. దీనికి ఎస్‌ఈ స్పందిస్తూ.. అనధికారికంగా గండ్లు కొట్టినట్లు తేలితే పరిశీలించి వెంటనే పూడ్చివేసి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పండ్లతోటల రైతుసంఘం నాయకులు అనంతరాముడు, నారపరెడ్డి, ఆనంద్, మురళీమోహన్ చౌదరి, వెంకటేశ్వర చౌదరి, రామాంజినేయులు, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నారు'

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్నవారిపై కేసు నమోదు చేయాలని నగరంలోని ప్రభాకర్ వీధికి చెందిన షేక్ బాబాజీ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ముస్లింలతో కలిసి వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. కడప అమీన్‌పీర్ దర్గాపై కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని, స్వామి కుమారుడు కేఎస్ఎస్ అరీఫుల్లా హుస్సేన్‌పైనా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు.

క్రీడల్లో మహిళల ప్రతిభ అనిర్వచనీయం



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న విశాలాఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మహిళలు రాణిస్తుండడం అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగిస్తోందని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా క్రికెట్ కప్-2025 టోర్నీ ప్రారంభోత్స వానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, బ్యాటింగ్, బౌలింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాలాఫెర్రర్ మాట్లాడుతూ... మహిళలు క్రీడల్లో అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడలకు, క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం, ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. మొత్తం ఈ టోర్నీలో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. అనంతరం జరిగిన పోటీల్లో కర్నూలు జట్టుపై మయూఖా అకాడమి ఒంగోలు జట్టు, చిత్తూరు డీసీఏ జట్టుపై అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు, ఏఎస్ఏ జీఆర్ జట్టుపై ఎమ్మెస్కే అకాడమీ హైదరాబాద్ జట్టు గెలుపొందాయి. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, విజయవాడ హరికృష్ణ, యూఖా అకాడమీ వెంకటేశ్వరరెడ్డి, కోచ్‌లు కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తిరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో గల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. గుత్తి పట్టణం చెర్లోపల్లి కాలనీకి చెందిన సంతోష్, శివ ద్విచక్రవాహనంలో నంద్యాల జిల్లా ప్యాపిలికి బయలుదేరారు. ఊబిచెర్ల గ్రామశివారులోకి రాగానే వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత సంతోష్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అలాగే నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డికి చెందిన జయరాముడు, కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంలో గుత్తికి వెళ్తుండగా ఊబిచెర్ల గ్రామశివారులో వెనుక నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అంబాపురంక్రాస్ వద్ద మరొకరికి..

కణేకల్లు: మండలంలోని అంబాపురంక్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొమ్మనహాళ్ మండలం వన్నళ్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి, సోమశేఖర్ బైక్‌లో కణేకల్లు వైపు బయలుదేరారు. అంబాపురం క్రాస్ వద్దకు రాగానే యర్రగుంటకు చెందిన పర్వత్‌రెడ్డి అనే వ్యక్తి మరో బైక్‌లో ఎదురుగా వచ్చాడు. ఈ క్రమంలో ముందు వెళుతున్న లారీని నాగిరెడ్డి ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయే ప్రయత్నంలో లారీ కిందకు పడ్డాడు. దీంతో వెనుక కూర్చున్న సోమశేఖర్ కాళ్లపై లారీ ఎక్కడంతో ఎడమకాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే ఆయన్ను బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుడి వీరంగం

రాయదుర్గం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన కారు నిలిపి దంపతులు అటవీ ప్రాంతాన్ని సందర్శిస్తుండగా.. వారిపై రాయదుర్గం ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు వీరంగం సృష్టించాడు. ఈ ఘటన ఆలస్యంగా తెలియవచ్చింది. నంద్యాల జిల్లా మహానంది వద్ద ఉన్న ఆంజనేయ కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న నరసింహస్వామి ఆలయం వద్ద కర్నూలుకు చెందిన గుర్రం సాయిచైతన్య దంపతులు కారును నిలిపి ఆలయాన్ని సందర్శిస్తున్నారు. కాగా సంక్రాంతి కోడిపందేల కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్న డీ.హీరేహాళ్‌కు చెందిన వైసీపీ కన్వీనర్ వన్నూరుస్వామి కారును అతి వేగంగా నడుపుతూ నిలిపి ఉన్న చైతన్య వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో పక్కనే ఉన్న చైతన్య అతడిని నిలదీశాడు. వన్నూరుస్వామితో పాటు ఉన్న మరికొందరు వీరంగం సృష్టించి చైతన్యపై దాడికి పాల్పడ్డారు. రాజకీయంగా తమకు పలుకుబడి ఉందని, మీ అంతు చూస్తామని బెదిరించారు. దీంతో చైతన్య చేతికి గాయాలయ్యాయి. ఘటనపై మహానంది పోలీస్ స్టేషన్‌లో చైతన్య ఫిర్యాదు చేయగా.. ఆ మేరకు వైసీపీ నాయకుడిపై పోలీసులు బీఎన్ఎస్ 115, 125 కింద కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అక్రమ్ బాషా ఎంపిక



కళ్యాణదుర్గం రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ పోటీల కు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఎంఎస్ అక్రమ్ బాషా ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం అనంతపురం జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీగా ఉన్నారు. ఈ నెల 16 నుంచి 19 వ తేదీ వరకు మదనపల్లిలో జరిగే పోటీల్లో మొత్తం 22 జిల్లాల జట్లు పాల్గొంటాయి. ఆ జిల్లాల జట్ల నుంచి 18 మంది ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర జట్టు తరపున జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుంది. ఈ ఎంపికలో ఎంఎస్ అక్రమ్ బాషాకు చోటు లభించింది. దీంతో దుర్గం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

రాయదుర్గం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామంలో ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లో బుధవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో ఎన్‌టీఆర్ నగర్‌లో గురువారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికులు గ్రహించి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని బోరంపల్లి, గంగవరం గ్రామాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్ చోరీ చేశారు. ఆ గ్రామాల మధ్య దాదాపు పది కుటుంబాలు నివాసం ఉంటుండడంతో అక్కడ సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దుండగులు దానిని ధ్వంసం చేశారు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డబ్బు వసూలు చేస్తున్న ఇద్దరి అరెస్టు

తాడిపత్రి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాల్లో గత రెండురోజులుగా చిన్నబాబు అలియాస్ సురేష్ అనే వ్యక్తి తాను ఓ టీవీ రిపోర్టర్ అని చెప్పుకుంటూ పలు షాపుల యజమానులతో డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లగా.. వారు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో గురువారం చుక్కలూరు క్రాస్‌లోని బొరుగుల బట్టీ వద్ద డబ్బులు వసూలు చేస్తుండగా సురేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నందలపాడుకు చెందిన తిమ్మదాసు అనే మరొక వ్యక్తిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిహారం చెక్కు పంపిణీ

బెళుగుప్ప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో బాణావత్ వెంకటేష్ నాయక్‌కు చెందిన 11 గొర్రెలు మృతి చెందగా.. ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ. 60,500లు మంజూరు చేసింది. అందుకు సంబంధించిన చెక్కును గురువారం టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున బాధిత రైతుకు అందజేశారు. వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై సమావేశం

గుత్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఇంటి, కొళాయి పన్నులు వసూలు వంద శాతం పూర్తి చేసేలా సిబ్బంది పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. కాలనీలో పర్యటించి ఇంటి, కొళాయి పన్ను చెల్లించాలని మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని ప్రజలకు అవగాహన కల్పించి పన్నులు వసూలు చేయాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

గుంతకల్లు టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిర్మల హృదయ భవన్ ఆశ్రమంలో ఉన్న ఓ వృద్ధురాలు మృతి చెందగా.. ఆ నలుగురు సేవాసమితి వారు అంత్యక్రియలు నిర్వహించారు. ఆశ్రమంలో ఉంటున్న అనాథ వృద్ధురాలు మునిలక్ష్మి(65) గురువారం మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు వృద్ధురాలి అంత్యక్రియలను పాతగుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు కరాటే రవితేజ, వంశీ, రవీంద్ర, ఆటోవేణు, జనసేన పురుషోత్తం పాల్గొన్నారు.

801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 801 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 452 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలను పాటించాలి

● వక్తల సూచన ● రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



గుంతకల్లులో మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్



రాయదుర్గంలో మాట్లాడుతున్న ప్రాంతీయ రవాణా అధికారి విశ్వనాథ్ రెడ్డి

గుంతకల్లుటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలను ఆర్టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ రాజాబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ కేవీ గంగాధర్ సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం వారు రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ సంవత్సరాంతం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు బస్సులను జాగ్రత్తగా నడపాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించరాదని, ఇతురులతో మాట్లాడరాదని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జి మల్లికార్జున, ఎస్‌టీఐ కృష్ణనాయక్, సూపర్‌వైజర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయని డిపో మేనేజర్ శంకర్ తెలిపారు. ప్రారంభించేందుకు ముఖ్య అతిథులుగా అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆదోని, తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, పట్టణ, రూరల్ సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరికి వారు భద్రతా చర్యలు పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా బస్సు డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రీజనల్‌మేనేజర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఆర్టీసీ సంస్థ తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి సూచించారు. పట్టణంలోని డిపో గ్యారేజీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చేనెల 15వ తేదీ వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్మెట్లు, సీట్‌బెల్ట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. సీఐ మహానంది, ఎస్‌టీఐ రమణమ్మ పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ బస్సులతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని ప్రాంతీయ రవాణా అధికారి విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విశ్వనాథ్ రెడ్డి హాజరై మాట్లాడారు. కంటిచూపు సమస్య ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు రాత్రి డ్యూటీలకు వెళ్లకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

టీడీపీలోకి నాలుగు కుటుంబాల చేరిక



టీడీపీలోకి చేరిన వారితో నాయకుడు ధర్మతేజ

కళ్యాణదుర్గం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురం గ్రామంలో వైసీపీకి చెందిన నాలుగు కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం వారు టీడీపీ నేత ధర్మతేజ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ధర్మతేజ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మణికంఠ, లింగన్న మారుతి, గంగన్న తదితరులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు సీఎం అయిన ఆరు నెలల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఇందుకు ఆకర్షితులై తాము టీడీపీలోకి చేరామన్నారు. టీడీపీ ఎల్లవేళలా అండగా వుంటుందని ధర్మతేజ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు , వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, మాజీ జడ్పీటీసీ వెంకటేశులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుత్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను గురువారం ఉదయం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా అల్పాహారాన్ని స్వయంగా వడ్డించారు. అలాగే క్యాంటీన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ.. క్యాంటీన్‌తో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

రాయదుర్గంటౌన్: అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న రోజువారీ మెనూను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బొమ్మనహాళ్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామంలోని బీసీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ నాయకుడు పల్లి తిప్పేస్వామి గురువారం ప్రకటనలో కోరారు. రెండువారాలుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా.. పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాలనీ మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుని కాలం గడుపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలన్నారు. లేకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

కనీస మద్దతు ధర ప్రకటించాలి

రాయదుర్గంటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతు ఉద్యమనాయకుడు జగ్జిత్‌సింగ్ ప్రాణాలను కాపాడాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం రైతు సమస్యలపై మొండివైఖరి వీడాలన్నారు. వ్యవసాయ నల్లచట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు జునైద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దవడుగూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టూరు గ్రామంలో టీడీపీ కార్యకర్త భాస్కర్ (55) బుధవారం హఠాన్మరణం చెందారు. ఇందుకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు చిట్టూరు గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు శంకర్, నారాయణరెడ్డి గురువారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబసభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

అటవీభూమిని ఆక్రమిస్తే కేసులు

యాడికి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అటవీభూముల ఆక్రమణ చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి తెలిపారు. మండలంలోని కూర్మాజీపేట గ్రామ సమీపంలోని అటవీ భూమిలో కొందరు వ్యక్తులు మామిడిమొక్కలు నాటి ఆ భూమి ఆక్రమణ యత్నం చేశారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి, బీట్ ఆఫీసర్ మాధవి డీఎఫ్ఓ విఘ్నేశ్ అప్పావు ఆదేశాల మేరకు గురువారం అటవీభూమిలో అక్రమంగా నాటిన మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లోకి అనుమతులు లేకుండా యంత్రాలను తీసుకువెళ్లడం కూడా నేరమని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్‌టీఐపై విజిలెన్స్ విచారణ

ఉరవకొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమణమ్మపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. కార్మికుల పట్ల ఆమె దురుసుగా ప్రవర్తిస్తున్నారని డ్రైవర్లు, కండెక్టర్లు విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక డిపోలో గురువారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు విచారణ జరిపారు. ఎస్‌టీఐ, కార్మికుల నుంచి వేర్వేరుగా వివరాలడిగి తెలుసుకున్నారు. ఆమె విధులకు హాజరు కాకపోయినా, వచ్చినట్లు నమోదు చేస్తున్నారని కూడా ఫిర్యాదు అందిందని, ఆ మేరకు విచారణ చేస్తున్నట్లు అధికారి వెల్లడించారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

బ్రహ్మసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరలించాలని ఎస్ఐ నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వాహనదారులకు గురువారం ఆయన రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ ఈ మేరకు అవగాహన కల్పించారు.

అధ్వానంగా ధర్మాపురం రోడ్డు

● గుంతలు పడి, కంకర తేలి..
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు




గుంతలతో అధ్వానంగా ఉన ధర్మాపురం రోడ్డు


గుత్తిరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ధర్మాపురం ఉంది. గత 15 ఏళ్ల క్రితం ఈ గ్రామానికి బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం అది కంకర తేలి, గుంతలు పడి తీవ్ర అధ్వానంగా ఉంది. దానిపై ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. రాత్రివేళల్లో గుంతలకు ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు చెబుతున్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందంటున్నారు. సంబంధితాధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్ల మధ్యలో గుంతలు

● ప్రమాదాలకు గురువుతున్న వాహనదారులు



బళ్లారి - కళ్యాణదుర్గం రోడ్డుపై పడిన గుంత



బీసీ హాస్టల్‌కు వెళ్లే దారిలో..

బొమ్మనహాళ్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌క్యాంప్ గ్రామం వద్ద బళ్లారి, కళ్యాణదుర్గం రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. మండల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వా రు ఈ రహదారిలో అధికంగా ప్రయాణిస్తుంటారు. మధ్యలో ఉన్న ఆ గుంత వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురైనట్లు చెబుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని, దగ్గరకు వచ్చేవరకు వాహనదారులు గుంతను గమనించలేరని అంటున్నారు. తీరా దగ్గరకు వచ్చాక దానిని తప్పించే ప్రయత్నం చేసినప్పుడు వాహనం అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతు న్నాయని వాపోతున్నారు. అలాగే మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు వెళ్లే దారిలో కూడా గుంత ఏర్పడి విద్యార్థులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే జేసీ అస్మిత్



వెంకటాంపల్లిలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం, ఆవులాంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. వాటిల్లో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొని స్థానిక సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ త్వరితగతిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి, నాయకులు గంగరాజుయాదవ్, ప్రసాద్‌యాదవ్, బాలిరెడ్డి, రమేష్‌యాదవ్, నాగరాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి: పట్టణంలోని టౌన్‌బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న లబ్ధిదారులు వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. స్థానిక టౌన్‌బ్యాంక్‌లో ఆయన మాట్లాడుతూ.. గతంలో టౌన్ బ్యాంక్ బాగా టర్నోవర్ ఉండేదని, రూ.80కోట్ల వరకు టర్నోవర్ జరిగేదని అన్నారు. కొంతకాలంగా బ్యాంకు దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐదు సంవత్సరాలుగా రికవరీలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కొందరి పెద్దలతో, వ్యాపారులతో మాట్లాడి డిపాజిట్లు చెల్లించేలా ఏర్పాటుచేయడంతో మళ్లీ మనం టౌన్ బ్యాంక్‌ను ఇలా చూడగలుగుతున్నామని అన్నారు. కొందరి నిర్లక్ష్యం వల్ల లోన్లు రికవరీ చేయకపోవడంతో అప్పట్లో లోన్లు నిలుపుదలచేశారన్నారు. అప్పటి నుంచి బ్యాంక్ టర్నోవర్ లేకపోవడంతో ప్రస్తుతం ఆర్బీఐతో చర్చించి పర్మిషన్ తెచ్చామన్నారు. ఇకనుంచి లోన్లు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని కంతులను బ్యాంక్‌కు సక్రమంగా చెల్లించినట్లయితే మరికొందరికి రుణాలు అందేలా చూడవచ్చని ఆయన తెలిపారు.

పట్టణాభివృద్ధికి కృషి

● టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్



మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పామిడి పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న గంగిరెడ్డి కాలువ లైనింగ్ పనులను గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పటిష్ఠ డ్రైనేజీ వ్యవస్థకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు రూ.3కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. విడతల వారీగా కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు బొమ్మా మోహన్‌కృష్ణ, హెచ్పీసీ పామిడి డిస్ట్రిబ్యూటరీ ప్రెసిడెంట్ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పట్టణంలోని వీకేఆదినారాయణరెడ్డి కాలనీలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఖలీల్ మృతదేహాన్ని గుమ్మనూరు ఈశ్వర్ సందర్శించి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే అంబేడ్కర్ కాలనీలో పక్షవాతానికి గురై మంచాన పడిన టీడీపీ కార్యకర్త రాజును పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

దళిత చిన్నారిపై దాడిని ఖండిస్తూ నిరసన

పామిడి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజు థియేటర్ సమీపాన దళిత చిన్నారి అజయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం పలువురు దళితులు నిరసన చేపట్టారు. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన దళిత దంపతులు సుధాకర్, నాగరత్నమ్మ బుధవారం రాత్రి సినిమాకు వచ్చారు. థియేటర్ సమీపాన షాపులు మూసివేసి ఉండడంతో వారి కుమారుడు చిన్నారి అజయ్ మూత్ర విసర్జన చేశాడు. షాపు నిర్వాహకులు గమనించి ఆ చిన్నారిని తల్లిదండ్రుల ఎదుటే చితకబాదారు. దీంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి రోడ్డుపై బైఠాయించారు. పలువురు మాట్లాడుతూ చిన్నారిని చితకబాదిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఐ యుగంధర్ కలుగజేసుకుని నిందితులపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేశామని చెప్పి వారితో నిరసన విరమింప జేశారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే గోవిందు, దళిత సంఘాల నాయకులు బాలరాజు, సుధీర్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



జలశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ

పెద్దపప్పూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా అక్కడి సచివాలయాన్ని కూడా తనిఖీ చేశారు. అలాగే నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించి ఫిల్టర్, వివిధ భాగాలను పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి తెలియజేశారు. చాగల్లు జలాశయంలో ఉన్న పంపుసెట్‌లను పరిశీలించారు. పంపుసెట్ల ద్వారా తాగునీటిని ఎక్కడకు సరఫరా చేస్తున్నారని ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్వర్‌రెడ్డి, ఈఓఆర్‌డీ సురేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ జాబ్‌కార్డులు లేవట

ఉన్నతాధికారులకు నివేదిక..?

పుట్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట జాబ్ కార్డులు సృష్టించి, ఉపాధి సొమ్మును కాజేసిన వ్యవహారం మరుగున పడేలా కనిపిస్తోంది. పుట్లూరు మండలం బాలాపురం పంచాయతీలో జరిగిన అవినీతిపై ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో 'సాఫ్ట్‌వేర్ కూలీలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు నివేదిక వెళ్లినట్లు తెలిసింది. బాలాపురం పంచాయతీలో ఐదేళ్ల నుంచి సింగిల్ జాబ్‌కార్డులు లేవని నివేదిక పంపినట్లు తెలిసింది. ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ అధికారిపై రాజకీయ నాయకుల ద్వారా టెక్నికల్ అసిస్టెంట్ ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఆ అధికారి వైసీపీకి మద్దతుగా నిలిచి, అన్ని పనులు చక్కదిద్దుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన ఆటలు సాగడం లేదు. కానీ, పంచాయతీలో ఆయనకు నచ్చితేనే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉంటారనే ప్రచారం ఉంది. ఆయనకు నచ్చకపోతే, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఏదో ఒక సాకుతో ఇబ్బంది పెడతారని సమాచారం. లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్న ఆయన, తనను ఏ మండలానికి బదిలీ చేసినా వెళ్లిపోతానని చెబుతుంటారు. ఏ పంచాయతీలో పనులు చేసినా, అన్ని పార్టీల నాయకులతో సత్సంబంధాలు నెరుపుతారని, అందరికీ 'న్యాయం' చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం బాలాపురం పంచాయతీలో సైతం తనకు తెలియకుండా ఏ పనులూ చేయవద్దని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం.